RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్: చెరుకు ఉపేందర్ | మంగళవారం 31 డిసెంబర్ 2024

సంపుటి: 2 | సంచిక: 232 | పేజీలు: 4 | వెల: రూ.5/-

## న్యూ ఇయర్ వేడుకలకు
# పటిష్ట ఏర్పాట్లు

సైబరాబాద్ పరిధిలో ఫ్లై ఓవర్ల మూసివేత.. అర్ధరాత్రి వరకు మెట్రో రైల్ సర్వీసులు





2

## తెలంగాణ ఆత్మ బంధువు
# మన్మోహన్ సింగ్



### భారతరత్న ఇవ్వాలంటూ ప్రత్యేక తీర్మానం
### ఆర్థిక రూపశిల్పి అని కొనియాడిన సిఎం రేవంత్
### మన్మోహన్ దేశ గతిని మార్చిన నేత అని మంత్రుల కితాబు


**హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు):** దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు తెలంగాణ అసెంబ్లీ ఘనంగా నివాళి అర్పించింది. ఆయనకు భారతరత్న ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. ఆయన సేవలను కొనియాడుతూ అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో శ్రద్ధాంజలి ఘటించారు. మన్మోహన్ ఆర్థిక సంస్కరణల రూపశిల్పి అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. మన్మోహన్ మృతి నేపథ్యంలో తెలంగాణశాసనసభ ప్రత్యేక సమావేశంలో ఆయన సంతాప తీర్మానం ప్రవేశపెట్టి మాట్లాడారు. మన్మోహన్ సింగ్ దేశానికి విశిష్ట సేవలు అందించారని రేవంత్ గుర్తుచేశారు. కేంద్ర ఆర్థిక శాఖ సలహాదారుగా, ఆర్బీఐ గవర్నర్‌గా పని చేశారని చెప్పారు. ప్రణాళిక సంఘం డిప్యూటీ ఛైర్మన్‌గా, కేంద్ర ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా దేశానికి సేవలందించారని పేర్కొన్నారు. 1991-96 మధ్య దేశ ఆర్థిక వ్యవస్థకు ఆయన ఊపిరిలూదారని సీఎం వివరించారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు తెలంగాణ ఏర్పాటుకు మార్గం సుగమం అయింది. 2014లో ఆంధ్రప్రదేశ్ పునర్‌వ్యవస్థీకరణ చట్టాన్ని పార్లమెంటు ఆమోదించింది. ఎన్నో ఏళ్ల పోరాట ఫలితంగా తెలంగాణ ఏర్పడింది. మన్మోహన్ సింగ్ ఎల్‌పీజీ విధానాలతో భారత ఆర్థిక వ్యవస్థను స్థిరంగా నిలిపారు. 2004-14 మధ్య ప్రధానిగా అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టారు. ఉపాధిహామీ, ఆర్టీఐ, ఎన్‌హెచ్‌ఆర్‌ఎంను ప్రారంభించారు. ఆర్థిక స్థితిగతులు మార్చే నిర్మాణాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టారని సిఎం అన్నారు. సామాజిక విప్లవ కార్యక్రమమైన ఆధార్‌ను మన్మోహన్ ప్రారంభించారు. సరళీకృత ఆర్థిక విధానాలు తెచ్చి ప్రపంచంతో పోటీపడేలా పునాది వేశారు. ఆయన సేవలు భావితరాలు గుర్తుంచుకోవాలి. ఆయనకు ..మిగతా 2లో

## హైదరాబాద్‌లో మన్మోహన్ సింగ్
## జీవిత చరిత్ర తెలిపేలా స్మారకం
### మంత్రి కోమటిరెడ్డి




**హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు):** తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ జీవిత చరిత్ర తెలిపేలా స్మారకం ఏర్పాటు చేస్తామని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లోనూ మన్మోహన్ సింగ్ విగ్రహాలు ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. ఇటీవల మరణించిన భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సంతాపం తెలిపేందుకు తెలంగాణ అసెంబ్లీ సోమవారం ప్రత్యేకంగా భేటీ అయ్యింది. మన్మోహన్ సింగ్‌కు భారత రత్న ..మిగతా 2లో

## హైదరాబాద్‌లో సత్య నాదెళ్ల
### మర్యాదపూర్వకంగా కలిసిన సిఎం రేవంత్
### ఫ్యూచర్‌సిటీలో పెట్టుబడులకు వినతి



**హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు):** తెలంగాణలో ముఖ్యంగా హైదరాబాద్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని మైక్రోసాఫ్ట్ సిఇవో సత్యనాదెళ్లను సిఎం రేవంత్ రెడ్డి కోరారు. మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్లతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. సత్య నాదెళ్లను ఆయన నివాసంలో మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్కిల్ యూనివర్సిటీలో మైక్రోసాఫ్ట్ భాగస్వామ్యం, ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ ప్రతిపాదనలు.. ఏఐ సిటీలో ఆర్అండ్‌డీ ఏర్పాటుకు సహకారంపై చర్చించారు. క్లౌడ్ కంప్యూటింగ్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చర్చిస్తూ.. క్లౌడ్ కంప్యూటింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కీలక పాత్ర పోషించాలని సీఎం కోరారు. ఓపెన్ ఏఐ నుంచి ఉచిత క్రెడిట్ ఇవ్వాలని మైక్రోసాఫ్ట్ సీఈవోకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో నాలుగు డేటా సెంటర్లు, హైదరాబాద్ కేంద్రంగా విస్తరణ తదితర అంశాలపై సీఎం చర్చించారు. ఐటి సెక్రటరీ జయేష్ రంజన్ కూడా వీరివెంట సీఈవో సత్యనాదెళ్లను కలిశారు. సత్య నాదెళ్ల వ్యక్తిగత పర్యటన కోసం ఇండియాకు వచ్చారు. ఆయన స్వస్థలం హైదరాబాద్. బంజారాహిల్స్ లోని ఆయన నివాసంలో ఉన్న సత్య నాదెళ్ల ఉన్నారు. ఆయనను అధికారికంగా కాకుండా మర్యాదపూర్వకంగా ప్రభుత్వ పెద్దలు కలిసినట్లుగా ..మిగతా 2లో



## ప్రజలను ఆకట్టుకునేందుకు
## కేజ్రీవాల్ విశ్వ ప్రయత్నాలు
### అర్చకులకు రూ. 18 వేల వేతనం ఇస్తామని ప్రకటన

**న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు):** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఎన్నికలు సమీపిస్తుండటంతో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ ప్రజలను ఆకట్టుకునేందుకు కీలక హామీలు ఇస్తోంది. ఈ నేపథ్యంలో ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ సోమవారం కీలక ప్రకటన చేశారు. ఆలయాలు, గురుద్వారాల్లో పనిచేసే పూజారులు, గ్రంథీలకు కేజ్రీ వరాల జల్లు కురిపించారు. తాము అధికారంలోకి వస్తే.. వారికి నెలకు రూ.18 వేలు గౌరవ వేతనం అందజేస్తామని ప్రకటించారు. సోమవారం కేజ్రీవాల్ విలేకరులతో మాట్లాడుతూ.. 'పురోహితులు, గ్రంథీలు మన ఆచారాలను భవిష్యత్తు తరాలకు అందజేయడంలో కీలక పాత్ర ..మిగతా 2లో

## మన్మోహన్ గొప్పతనాన్ని గుర్తించిన పీవీ
### రాజకీయాలకు అతీతంగా ఆర్థిక బాధ్యతలు అప్పగించిన పీవీ
### మన్మోహన్‌కు భారతరత్న ఇవ్వాలన్న తీర్మానానికి ఆమోదం
### పీవీకి కూడా ఢిల్లీలో గుర్తింపు దక్కాలని కోరిన కేటీఆర్



**హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు):** మన్మోహన్ సింగ్ గొప్పతనం, సామర్థ్యం, జ్ఞానాన్ని ముందుగా గుర్తించిన వ్యక్తి తెలంగాణ బిడ్డ పీవీ నరసింహారావు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. గొప్ప ఆలోచనకు అరుదైన సందర్భం వచ్చినప్పుడు ప్రపంచంలో ఏ శక్తీ ఆపలేదని చెప్పారు. మన్మోహన్ సింగ్ హయాంలోనే తెలంగాణ ఏర్పడిందని తెలిపారు. కేంద్రంలో ఓబీసీ శాఖను ఏర్పాటు చేయాలని మన్మోహన్ సింగ్‌ను కేసీఆర్ కోరారని గుర్తుచేశారు. మన్మోహన్‌కు నివాళి కోసం అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశం అయింది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సభ సంతాపం తెలిపింది. ఈ సందర్భంగా కేటీఆర్ ..మిగతా 2లో

## దేశ ఆర్థిక వ్యవస్థకు
## దశ, దిశ చూపిన దార్శనికుడు
### మన్మోహన్‌కు నివాళి కార్యక్రమంలో హరీష్ రావు
### స్కిల్ వర్సిటీకి పివి పేరు పెట్టాలని డిమాండ్



**హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు):** దేశ ఆర్థిక వ్యవస్థకు దశ, దిశ చూపిన వ్యక్తి మన్మోహన్ సింగ్ అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఆయనపై పీవీ నరసింహా రావు పెట్టుకున్న నమ్మకాన్ని ఒమ్ము చేయలేదని చెప్పారు. లైసెన్స్ రాజ్, పర్మిషన్ రాజ్, కోటా రాజ్ విధానాలకు మన్మోహన్ స్వస్తి పలికారని ..మిగతా 2లో

## గోటితో పోయేదాన్ని గొడ్డలి దాకా తెచ్చారు
### సంధ్య థియేటర్ ఘటనపై పవన్ వ్యాఖ్యలు



2



### ఖగోళ పరిశోధనల్లో భారత్
## అద్భుత విజయాలు
### 'స్పాడెక్స్'ను ప్రయోగించనున్న భారత్

**న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు):** ఖగోళ పరిశోధనల్లో అద్భుత విజయాలతో సత్తా చాటుతున్న భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మరో ప్రతిష్టాత్మక ప్రయోగానికి సిద్ధమైంది. ఎంతో కాలం నుంచి ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'స్పాడెక్స్' ప్రయోగాన్ని చేపట్టనున్నది. సోమవారం రాత్రి శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి పీఎస్ఎల్వీ సీ-60 రాకెట్ రెండు ఉపగ్రహాలను నింగిలోకి మోసుకెళ్లనుంది. అయితే స్పాడెక్స్ ప్రయోగ సమయంలో స్వల్ప మార్పులు చేశారు ఇస్రో శాస్త్రవేత్తలు. ముందుగా రాత్రి 9:58 గంటలకు పీఎస్ఎల్వీ (పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్) సీ-60 రాకెట్ ద్వారా ఎస్‌డీఎక్స్-01 (ఛేజర్), ఎస్‌డీఎక్స్-02 (టార్గెట్) ఉపగ్రహాలను ..మిగతా 2లో

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# ఫార్ములా కేసులో అత్యుత్సాహం ఎందుకో

## ఈడీ నోటీసు అందిందన్న కేటీఆర్



హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): ఈడీ ద్వారా నోటీస్ వచ్చింది..దానిలో ఏమి అనుమానం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రేపు కోర్టు లో చెబుతాం.. ఏ కేసులో దూకుడుగా లేని ఈడీ? ఈ కేసులో మాత్రం అత్యుత్సాహం చూపిస్తుందని కేటీఆర్ మండిపడ్డారు. నేను ఎఫ్ఐఆర్ ను సవాల్ చేస్తున్నాను.. కోర్టు ఏమి చెబుతోంది.. కోర్టు చెబితే ఈడీ, ఏసీబీ ఇక ఏది కూడా ఉండదు కదా అన్నారు. మన్మోహన్ సింగ్ కోసం ప్రత్యేక సమావేశం పెట్టారు..పీవీ ని కూడా గౌరవించాలన్నారు. పీవీ కి కూడా న్యాయం జరిగే దాకా కొట్లాడతామన్నారు. 2025 సంవత్సరం లో కమిటీ లు ఉంటాయి, సంస్థాగత నిర్మాణం ఉంటుందన్నారు. సభ్యత నమోదు ఉంటుందన్నారు. అధ్యక్షుడు ఎన్నిక కూడా ఉంటుందని కేటీఆర్ అన్నారు. బహిరంగ సభ పై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రక్షణ కవచం లాగా ఇక్కడ బీజేపీ ఎంపీ లు, కేంద్ర మంత్రులు ఉన్నారని తెలిపారు. అందుకే అమృత్ టెండర్ లపై కేంద్రం నోరు విప్పట్లేదన్నారు. పనికి మాలిన కేస్ లు పెడుతున్నారని మండిపడ్డారు కేటీఆర్. అక్రమ కేస్ లు పెట్టి బెదిరించాలని చూస్తున్నారని అన్నారు. నాపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు.. మంత్రి గా నిర్ణయం తీసుకున్నాను అని మొదటి రోజు చెప్పానని ..ఇప్పుడు కూడా అదే మాటకు చెప్తున్నానని తెలిపారు.

# న్యూ ఇయర్ వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు



హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): ఆంగ్ల నూతన సంవత్సరాది మరికొన్ని గంటల్లో రానుంది. ఈ క్రమంలో ప్రపంచమంతా వేడుకలకు సిద్ధం అవుతుంది. న్యూఇయర్ వేడుకల నేపథ్యంలో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు ఆంక్షలు విధించారు. డిసెంబరు 31 రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు ఐటీ కారిడార్‌లో ఫ్లై వర్లను మూసివేయనున్నట్లు పోలీసులు తెలిపారు. ఓఆర్ఆర్‌పై భారీ వాహనాలు, ఎయిర్‌పోర్టుకు వెళ్లే వాహనాలను మాత్రమే అనుమతిస్తామన్నారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో స్పెషల్ కెమెరాలను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. సిగ్నల్ జంపింగ్, ర్యాష్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడతారని చెప్పారు. మద్యం సేవించిన వారికి పబ్‌లు, బార్ల యాజమానులు ప్రైవేటు వాహనాలు, డ్రైవర్లను అందుబాటులో ఉంచాలని పోలీసులు సూచించారు. న్యూఇయర్ వేడుకల దృష్ట్యా డిసెంబరు 31న రాత్రి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించ నున్నట్లు తెలంగాణ ఫోర్ వీలర్స్ సంఘం ప్రకటించింది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఉచిత రవాణా సౌకర్యాన్ని కల్పించనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. 500 కార్లు, 250 క్యాబ్‌లు అందుబాటులో ఉంటాయని అసోసియేషన్ తెలిపింది. ప్రజలు మద్యం మత్తులో వాహనాలు నడపొద్దని, రోడ్డు ప్రమాదాలు జరగకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడిరచింది. నూతన సంవత్సర వేడుకలను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ మెట్రో రైళ్లు అర్ధరాత్రి వరకు సేవలందించనున్నాయి. డిసెంబర్ 31 సెలబ్రేషన్స్ సందర్భంగా రాత్రి 12.30 వరకు నడవనున్నాయి. ప్రయాణికుల సౌకర్యార్థం అర్ధరాత్రి 12.30కి చివరి రైలు స్టేషన్ నుండి బయలుదేరి 1.15 వరకు డెస్టినేషన్ స్టేషన్లో చేరుకోనున్నట్టు మెట్రో ఎండి ఎన్వీఎస్ రెడ్డి ప్రకటించారు. న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ సందర్భంగా అర్ధరాత్రి వేడుకలు ఉండటంతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు విస్తృతంగా జరిగే అవకాశం ఉండటంతో సేఫ్ గా ఇంటికి చేరుకునేందుకు మెట్రో ఎంతగానో ఉపయోగపడనుంది. ఈ క్రమంలో.. ప్రయాణికులు మెట్రో రైల్‌లో సేవ్ జర్నీ చేయాలని మెట్రో ఎండీ సూచించారు. మెట్రో రైల్ సేవలను ప్రత్యేక అకేషన్ పండుగలు టైంలో అర్ధరాత్రి వరకు మెట్రో సేవలను పొడిగిస్తున్నట్టు తెలిపారు. మద్యం తాగి మెట్రోలో తోటి ప్రయాణికులను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రయాణికులంతా బాధ్యతాయుతంగా వ్యవహారించాలని మెట్రో ఎండి సూచించారు.

## దేశ ఆర్థిక వ్యవస్థకు దశ, దిశ చూపిన దార్శనికుడు

మొదటి పేజీ తరువాయి...

తెలిపారు. అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశమైంది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సభ నివాళులు అర్పించింది. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. యూపీఏ హయాంలో ఎన్నో కుంభకోణాలు జరిగినట్లు వార్తలొచ్చాయి. కానీ ప్రధానిగా ఉన్న మన్మోహన్ సింగ్‌పై ఒక్క అవినీతి ఆరోపణ రాలేదని గుర్తుచేశారు. మన్మోహన్ సింగ్ జీవితం దేశ సేవలో ధన్యమైందని చెప్పారు. ఆయన సేవలను గుర్తుంచుకునేలా ప్రభుత్వాలు ఏం చేసినా బీఆర్ఎస్ పార్టీ మద్దతు ఇస్తుందని వెల్లడించారు. పీవీ ఖ్యాతిని చాటేలా బీఆర్ఎస్ ప్రభుత్వం కార్యక్రమాలు చేపట్టిందని, స్కిల్ వర్సిటీకి నరసింహారావు పేరు పెట్టాలని ప్రతిపాదించారు. భారత రత్నకు మన్మోహన్ సింగ్ 100 శాతం అర్హులేనని చెప్పారు. ఆయనకు కేంద్ర ప్రభుత్వం భారత రత్న ఇవ్వాలని బీఆర్ఎస్ కోరుతున్నదని తెలిపారు. గతంలో పీవీకి భారత రత్న ఇవ్వాలని బీఆర్ఎస్ తీర్మానించిందని, దానికి అనుగుణంగా కేంద్రం దేశ అత్యున్నత పౌర పురస్కారం ఇచ్చిందని గుర్తుచేశారు. గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను బాగుచేసేందుకు పీవీ-మన్మోహన్ ద్వయం కృషి చేసిందని వెల్లడించారు. 1996లో కాంగ్రెస్ ఓటమికి ఆర్థిక సంస్కరణలూ కారణమని ఓ కమిటీ నివేదిక ఇచ్చిందని, దానిని చూసిన మన్మోహన్ సింగ్ కంటతడి పెట్టారని పేర్కొన్నారు. మన్మోహన్ భౌతికంగా లేకున్నా ఆయన చేసిన సేవలు ఎప్పటికీ ఉంటాయన్నారు. విదేశాల్లోనూ ఆయనకు ఉన్నత ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. వాటికంటే దేశమే ముఖ్యమని చాటిన గొప్ప వ్యక్తి మన్మోహన్ అని చెప్పారు. ఆయన ఎప్పుడూ పదవుల కోసం చూడలేదని, పదవులే ఆయనను వెతుక్కుంటూ వచ్చాయన్నారు. మన్మోహన్ సంతాప తీర్మానాన్ని మండలిలోనూ పెట్టి ఉంటే బాగుండేదని చెప్పారు.

## ప్రజలను ఆకట్టుకునేందుకు కేజ్రీవాల్ విశ్వ ప్రయత్నాలు

మొదటి పేజీ తరువాయి...

పోషిస్తున్నారు. సమాజానికి వారు నిస్వార్థంగా సేవ చేస్తున్నారు. దురదృష్టవశాత్తు వారి ఆర్థిక శ్రేయస్సును ఎవరూ పట్టించుకోవడం లేదు. మేం అధికారంలోకి వస్తే వారికి నెలకు రూ.18 వేలు గౌరవ వేతనం అందిస్తాం' అని కేజ్రీవాల్ అన్నారు. ఈ పథకానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ రేపటి నుంచే ప్రారంభం అవుతుందని కేజ్రీ వెల్లడించారు. హనుమాన్ ఆలయంలో తానే స్వయంగా ఈ ప్రక్రియను ప్రారంభిస్తానని తెలిపారు. ఈ ప్రక్రియకు అడ్డుపడొద్దని ఈ సందర్భంగా బీజేపీని కేజ్రీ అభ్యర్థించారు. 'రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అడ్డంకులు సృష్టించవద్దని నేను బీజేపీని అభ్యర్థిస్తున్నాను. దీన్ని అడ్డుకోవడం పాపం చేసినట్లే అవుతుంది' అని వ్యాఖ్యానించారు.

# తెలంగాణ ఆత్మ బంధువు మన్మోహన్ సింగ్

మొదటి పేజీ తరువాయి...

భారతరత్న ఇవ్వాలని ఈ సభ తీర్మానం చేస్తోంది. ప్రపంచం గర్వించదగ్గ ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటు. ఆయన నీతి, నిజాయతీ, నిబద్ధత కలిగిన నేత. జీవితాన్ని దేశానికి అంకితం చేసిన గొప్ప వ్యక్తి. ప్రధాని సహా అనేక హోదాల్లో ఉన్నా నిరాడంబరంగా జీవించారు. ఉపాధిహామీ పథకాన్ని అనంతపురం, మహబూబ్‌నగర్ నుంచి ప్రారంభించారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహం ఏర్పాటు చేస్తాం .2013లో భూసేకరణ చట్టం తెచ్చి నిరుపేదలకు న్యాయం జరిగేలా చేశారు. 2006లో అటవీ హక్కుల చట్టానికి సవరణలు చేసి ఆదివాసీలను ఆదుకున్నారు. ఐటీ రంగంలో శాసించగలుగు తున్నామంటే మన్మోహన్ విధానాలే కారణం. ఆయన తెలంగాణకు ఆత్మబంధువు. 60 ఏళ్ల తెలంగాణ కలను సాకారం చేసిన నాయకుడు. తెలంగాణ బిల్లులను 2 సభల్లో పాస్ చేయించిన సారథి.÷నాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహం ఏర్పాటు చేస్తాం' అని రేవంత్‌రెడ్డి తెలిపారు. మన్మోహన్ సింగ్ సరళీకృత ఆర్థిక విధానాలతో దేశాన్ని బలమైన శక్తిగా నిలిపారని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అసమానతలు, సామాజిక పరిస్థితి అర్థం చేసుకుని చట్టాల ద్వారా ప్రజల్లో ధైర్యం నింపారన్నారు. మానవతా ప్రమాణాలు నెలకొల్పిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు.



చేపట్టిన ప్రతి పదవికీ వన్నె తెచ్చారని చెప్పారు. పాలనాపరమైన అంశాలను సామాన్యుడూ తెలుసుకునేలా 2005లో ఆర్టీఐ తెచ్చారని గుర్తుచేశారు. ఆయన తీసుకొచ్చిన ఉపాధి హామీ పథకం దేశ గతినే మార్చేసిందని పేర్కొన్నారు. మానవతా ప్రమాణాలు నెలకొల్పిన గొప్ప వ్యక్తి మన్మోహన్ సింగ్ అని భట్టి విక్రమార్క చెప్పారు. మన్మోహన్ సింగ్ హయాంలోనే విప్లవాత్మక భూసేకరణ చట్టం వచ్చిందని తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. దేశ క్షేమం దృష్ట్యా మన్మోహన్ సింగ్ న్యూక్లియర్ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆయన మృతి దేశానికి తీరని లోటు. రైతులకు రుణమాఫీ చేసిన తొలి ప్రధాని మన్మోహన్ సింగ్. సోనియా గాంధీ సూచనల మేరకు ఆయన గొప్ప చట్టాలు తెచ్చారు. ఆయన ప్రధానిగా ఉన్నప్పుడే గ్రామీణ ఉపాధి హామీ చట్టం వచ్చింది. ప్రభుత్వంలో ఉన్నవారు జవాబుదారీగా ఉండాలని సమాచార హక్కు చట్టం తీసుకొచ్చారు. ప్రజల సొమ్ముతో చేసిన పనుల వివరాలు తెలుసుకొనే హక్కు దీని ద్వారా లభించింది. ఆకలి చావులు ఉండకూడదని ఆహార భద్రత చట్టం తెచ్చారు' అని ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు. దేశాభివృద్ధికి మన్మోహన్ సింగ్ అనేక గొప్ప విధానాలు తీసుకొచ్చారని మంత్రి శ్రీధర్‌బాబు గుర్తు చేసుకున్నారు. ఆయన సాధారణ స్థాయి నుంచి ఉన్నతస్థాయికి ఎదిగారని కొనియాడారు. మన్మోహన్‌ను ఆర్థికమంత్రిగా అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు ఎంపిక చేశారని గుర్తు చేశారు. గ్రామీణ పేదలకు పని కల్పించే ఉపాధి హామీ పథకాన్ని మన్మోహన్ తెచ్చారని పేర్కొన్నారు. స్టాక్ మార్కెట్ పటిష్ఠంగా ఉండేలా చర్యలు తీసుకున్నారన్నారు. సామాన్య ప్రజలకు ఆయుధమైన 'ఆర్టీఐ', ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉండాలనే ఉద్దేశంతో 'ఆధార్' తెచ్చారన్నారు. మన్మోహన్ సింగ్ హయాంలో రాష్ట్రాల్లో ట్రిపుల్ ఐటీలు ఏర్పాటు చేశారని వివరించారు. తెలంగాణ ఏర్పాటులో ఆయన క్రియాశీల పాత్ర పోషించారని శ్రీధర్‌బాబు చెప్పారు.

# మన్మోహన్ గొప్పతనాన్ని గుర్తించిన పీవీ

మొదటి పేజీ తరువాయి...

మాట్లాడుతూ.. 'దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించే సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన సంతాప తీర్మానానికి బీఆర్ఎస్ తరఫున పూర్తిగా మద్దతిస్తున్నట్లు ప్రకటించారు. మన్మోహన్ సింగ్‌కు భారత రత్న ఇవ్వాలనే ప్రతిపాదనతో సంపూర్ణంగా ఏకీభవిస్తున్నామని అన్నారు. మన్మోహన్ సింగ్ గొప్పదనాన్ని, సామర్థ్యాన్ని మొదటిసారిగా గుర్తించింది మన తెలంగాణ బిడ్డ పీవీ నరసింహా రావు అనేది నిర్వివాదాంశం. పీవీ నరసింహా రావు దేశ ప్రధానిగా ఎన్నికైన తర్వాత రాజకీయాలతో సంబంధ లేని ఒక ఆర్థిక వేత్తను ఫైనాన్స్ మినిస్టర్‌గా నియమించారు. 1991లో బడ్జెట్ ప్రవేశపెడుతూ 'ప్రపంచం మొత్తం వినాల్సిన సమయం వచ్చింది. నా దేశం మేల్కొని ఉంది..' అంటూ ఆర్థిక వేత్తగా సంస్కరణలను ప్రవేశపెట్టే సందర్భంగా మాట్లాడారు. ఆ మాటలు.. ఆయన సిద్ధాంతం, పీవీ నరసింహారావు నాయకత్వం నేడు దేశంలో సమూల మార్పులు తీసుకొచ్చింది. కేవలం 15 రోజులు ఫారెక్స్ నిల్వలు ఉన్న నాటి రోజు నుంచి ప్రపంచమంతా ఆశ్యపడే స్థాయికి దేశాన్ని పరుగెత్తించిన ఆర్థిక సంస్కరణల శిలి డాక్టర్ మన్మోహన్ సింగ్. అనవసరపు డాంభికాలు, ఆర్భాటాలు, హడావుడి లేకుండా సింపుల్ లివింగ్.. హై థింకింగ్ అనే మాటకు పర్యాయపదంగా మన్మోహన్ సింగ్‌ను మనం చెప్పుకోవచ్చు. విశ్వాసం అనే నేటి రాజకీయాల్లో అరుదైన పదం. తనకు అండగా నిలబడిన కాంగ్రెస్ పార్టీకి జీవితాంతం సేవలందించిన మహానుభావుడు. ఆర్థికమంత్రిగా, తర్వాత ప్రధానిగా పనిచేసి, ఆ పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత కూడా పూర్తి స్థాయిలో పార్టీ కోసం పనిచేసిన అభ్యుదయ వాది, నిరాడంబర మనిషి మన్మోహన్ సింగ్ అని అన్నారు. ఆయన ప్రధానిగా ఉన్న కాలంలోనే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్.. ఏడాదిన్నరపాటు కేంద్ర మంత్రిగా పనిచేశారు. నాటి కాంగ్రెస్ పార్టీతో పొత్తుపెట్టుకుని గెలుపొందిన తర్వాత భాగస్వామ్య పక్షాలను మంత్రివర్గంలోకి తీసుకున్నారు. కేసీఆర్‌కు షిప్పింగ్ మంత్రి పదవి ఇస్తే.. డీఎంకేతో చిక్కుముడి ఏర్పడింది. దీంతో మన్మోహన్ సింగ్ వద్దకు వెళ్లి తాను వచ్చింది పదవుల కోసమో, పోర్టుఫోలియోల కోసమో కాదు.. తెలంగాణ కోసమని చెప్పిన కేసీఆర్.. ఆ మంత్రిత్వ శాఖను డీఎంకేకి ఇచ్చారు. ఈ సందర్భంగా ఏ నిబద్ధతతో వచ్చారో అది ఫలించాలని కోరుకుంటున్నానని కేసీఆర్‌తో మన్మోహన్ అన్నారు. మీరు తీసుకున్న నిర్ణయంతో గుర్తింపు వస్తుందని, కర్మయోగిగా గుర్తించబడతారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తర్వాత.. ఒక గొప్ప ఆలోచనకు అరుదైన సందర్భం వచ్చినప్పుడు ప్రపంచంలో ఏ శక్తీ ఆపలేదు. అలాగే మన్మోహన్ సింగ్ నమ్మారు కాబట్టే.. తెలంగాణ ఉద్యమంలో ఉన్న నిబద్ధత, ఉద్యమానికి ఉన్న బలం, తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తి.. అన్నీ ఆయనకు అర్థమయ్యాయి కాబట్టే అనివార్య పరిస్థితుల్లో మన్మోహన్ సింగ్ నాయకత్వంలో తెలంగాణ ఏర్పడింది. దానిని తాము మర్చిపోం అని అన్నారు. మన్మోహన్ సింగ్ నిబద్ధతను గుర్తుచేసే సందర్భంలో సరిగ్గా ప్రధానిగా వారు ఎన్నికైన తర్వాత ఆరు నెలలకు కేసీఆర్.. క్యాబినెట్ సహచరుడిగా డిసెంబర్ ముఖ్యమైన డెలిగేషన్ తీసుకొస్తున్నానని, తమకు సమయం ఇవ్వాలని కోరారు. బలహీన వర్గాలకు చెందిన నాయకులను తీసుకొస్తున్నానని, తమకు ఐదు నిమిషాలు సరిపోదని 30 నిమిషాలకు కావాలని కోరారు. సమస్య తీవ్రతను అర్థం చేసుకున్న నాటి ప్రధాని 45 నిమిషాలు సమయమిచ్చారు. ఆయన గొప్పతనమేంటంటే.. కేంద్రంలో ఓబీసీలకు ఒక మంత్రిత్వ శాఖ ఉండాలని ప్రధాని వద్దకు 2004, డిసెంబర్ 18న ఒక బృందాన్ని తీసుకెళ్తే, 45 నిమిషాలు సమయమిచ్చిన మన్మోహన్ సింగ్ గంటన్నరపాటు వారితో గడిపారు. ఎన్నో అడ్డంకులు, ఎన్నో అభ్యంతరాలున్నా మన్మోహన్ సింగ్ ప్రజా ఉద్యమాలకు అండగా నిలబడ్డారు. ఎన్నడూ కూడా, ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా సంస్కరణల బాట నుంచి వెనక్కి తగ్గలేదు. ఆయన్ని మనం సైలెంట్ ఆర్కిటెక్ట్ ఆఫ్ మోడ్రన్ ఇండియా అని పిలువవచ్చు. మన్మోహన్ కాదు ఈయన మౌన మోహన్ సింగ్ అని, మౌన ముని అని పేర్లు పెట్టారు. అయితే అవేవీ పట్టించుకోకుండా ఆయన పని ఆయన చేసుకుంటూ పోయారు. విప్లవాత్మకమైన సంస్కరణలు తీసుకొచ్చారు. అవమానం చేస్తే ఆకాశం స్థాయి తగ్గదు. ఎన్ని నిందలు వేసిన మహోన్నతులు వణకరు, బెనకరు. అలాంటి స్థితప్రజ్ఞతను మనం మన్మోహన్ సింగ్‌లో చూశాం అన్నారు. మన్మోహన్ సింగ్ గురించి మాట్లాడుకునేటప్పుడు మన తెలంగాణ బిడ్డ పీవీ నరసింహారావు గురించి కూడా గుర్తుచేసుకోవాలి. కేసీఆర్ ఆదేశాల మేరకు ఢిల్లీకి వెళ్లి మన్మోహన్ సింగ్‌కు నివాళులు అర్పించాం. అంత్యక్రియల్లో పాల్గొన్నాం. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించాం. అక్కడికి వెళ్లినప్పుడు మన్మోహన్ సింగ్‌కు జరిగిన గౌరవ ప్రదమైన వీడ్కోలు మన పీవీకి జరుగలేదనే బాధ అనిపించింది. మనవాడైన పీవీ నరసింహా రావుకు కూడా ఢిల్లీలో స్మారకం ఏర్పాటు చేయాలని తెలంగాణ శాసన సభ తీర్మానం చేయాలని, తెలంగాణ బిడ్డకు సముచిత గౌరవం కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలనే ప్రతిపాదన సభ నుంచి వెళ్తే బాగుంటుంది. ఢిల్లీలో అందరు ప్రధానులకు స్మారకం ఉంది. మన పీవీ నరసింహా రావుకు లేదు.

## హైదరాబాద్‌లో మన్మోహన్ సింగ్ జీవిత చరిత్ర తెలిపేలా స్మారకం

మొదటి పేజీ తరువాయి...

ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతూ ఈ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానంపై మంత్రి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచం మొత్తం మెచ్చిన ఆర్థిక వేత్త మన్మోహన్ సింగ్ అని కొనియాడారు. ఉన్నత స్థానాల్లో ఉన్నప్పటికీ, ఆయన ఎప్పుడు నిరాడంబరంగా జీవించేవారని పార్లమెంట్‌కు కూడా మన్మోహన్ సింగ్ లంచ్ బాక్స్ తెచ్చుకునేవారని చెప్పారు. దేశంలో నోట్లు రద్దు చేస్తే భారత ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అవుతోందని మన్మోహన్ సింగ్ ఎప్పుడు చెప్పేవారని, కేంద్ర ప్రభుత్వం 2016లో నోట్లు రద్దు చేసిన తర్వాత మన్మోహన్ సింగ్ చెప్పిందే నిజమైందన్నారు.దేశ ఆర్థిక వ్యవస్థ కుదేల్కొందన్నారు. రెండేళ్ల కిందట 92 ఏళ్ల వయసులోనూ మన్మోహన్ సింగ్ ధర్నా చేశారని, అప్పుడు తనకు ఆయనను కలిసే అవకాశం వచ్చిందని ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి యాది చేసుకున్నారు. మన్మో హన్ సింగ్ ఆర్బీఐలో అనేక మార్పులు తీసుకొచ్చారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అసెంబ్లీలో మన్మోహన్ మృతిపై సంతాప తీర్మానం సందర్భంగా మాట్లాడిన ఆయన. కరీంనగర్ ముద్దుబిడ్డ పీవీ ఆధ్వర్యంలో మన్మోహన్ ఆర్థిక మంత్రి అయ్యారని చెప్పారు. మన్మోహన్‌తో కలిసి పనిచేసే అవకాశం తనకు దక్కిందన్నారు పొన్నం. మోడల్ స్కూల్ వ్యవస్థను మన్మోహన్ తీసుకొచ్చరని చెప్పారు. గ్లోబలైజేషన్ తోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు పొన్నం. ఆర్టీఐ చట్టంతో పారదర్శకతకు పెద్దపీట దక్కిందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మన్మోహన్ సింగ్ 90 ఏళ్ల వయసులో వీల్ ఛైర్ లో వచ్చి రాజ్యసభలో ఓటు వేశారని గుర్తు చేశారు పొన్నం. దేశంలో 72 వేల కోట్ల రైతు రుణాలు మాఫీ చేశారని తెలిపారు. మన్మోహన్ సింగ్ హైదరాబాద్ కు ఓఆర్ఆర్, మెట్రో రైల్ ప్రాజెక్టులు ఇచ్చారని గుర్తు చేశారు పొన్నం. మన్మోహన్ మృతిపై ప్రపంచ దేశాలు స్పందించాయని మన్మోహన్ సహకారంతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యిందన్నారు.

## హైదరాబాద్‌లో సత్య నాదెళ్ల

మొదటి పేజీ తరువాయి...

తెలుస్తోంది. హైదరాబాద్‌లో సాఫ్ట్ వేర్ రంగ అభివృద్ధి కోసం సత్యనాదెళ్ల సూచనలు, సలహాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడిగినట్లుగా తెలుస్తోంది. సత్య నాదెళ్ల హైదరాబాద్‌లో చదువుకుని ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లారు. ఆయన తండ్రి యుగంధర్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి. ఆయన కొంత కాలం క్రితం చనిపోయారు. లో ప్రొ÷ల్ ఇష్టపడే సత్య నాదెళ్ల ఎక్కువ హంగామా చేయరు. హైదరాబాద్ వచ్చిన విషయం తెలియడంతో ప్రభుత్వ పెద్దలు ఆయనను కలవాలని ఆసక్తి చూపించడంతో అంగీకరించినట్లుగా తెలుస్తోంది. మైక్రోసాఫ్ట్ సీఈవోగా అధికారికంగా పర్యటనలకు గతంలో వచ్చారు. అప్పుడు నేరుగా మైక్రోసాఫ్ట్ ఆర్ అండ్ డీకి వెళ్లి ఉద్యోగులతో సమావావేశాలు నిర్వహించేవారు. హైదరాబాద్ మైక్రోసాఫ్ట్ .. అమెరికా తర్వాత అతి పెద్ద క్యాంపస్‌ను నిర్మిస్తోంది, డేటా, క్లౌడ్ రంగాల్లో పెట్టుబడులు పెడుతోంది. సత్య నాదెళ్లతో జరిగి సమావేశానికి పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబుతో పాటు, సీనియర్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా వెళ్లారు. అలాగే బీఆర్ఎస్ హయాం నుంచి తెలంగాణలో పెట్టుబడులు, ఇతర అంశాల్లో కీలకంగా వ్యవహరించి సీనియర్ అధికారి జయేష్ రంజన్ కూడా వెళ్లారు.

# ఖగోళ పరిశోధనల్లో భారత్ అద్భుత విజయాలు

మొదటి పేజీ తరువాయి...

నింగిలోకి పంపనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, అనూహ్యంగా ఈ సమయంలో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. 9:58కి బదులుగా 10:15కు ఈ ప్రయోగం చేపట్టనున్నట్లు ఇస్రో ప్రకటించింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా ట్వీట్ చేసింది. ఈ రాకెట్ ద్వారా 400 కిలోల బరువుతో రూపొందించిన స్పాడెక్స్ అనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన జంట ఉపగ్రహాలను నిర్దిష్ట కక్ష్యలో ప్రవేశపెట్టబోతున్నది. భవిష్యత్తులో భారత్ చేపట్టే ఉపగ్రహ ప్రయోగాలు, చంద్రునిపై జరిపే పరిశోధనలతోపాటు రోదసిలో భారత అంతరిక్ష కేంద్రం అభివృద్ధికి ఎంతో కీలకమైన ఈ ప్రయోగం ఖగోళ పరిశోధనల్లో ఇస్రో సాధించిన గణనీయ పురోగతికి సూచికగా నిలువనున్నది. విజయంతో 2024 సంవత్సరానికి వీడ్కోలు పలకాలని భావిస్తున్న ఇస్రో ఈ చారిత్రక ఘట్టాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయనున్నది. మరోవైపు ఈ నెల 5న ఇస్రో విజయవంతంగా ప్రోబా-3 మిషన్‌ని విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. పీఎస్ఎల్వీ సీ-59 రాకెట్ యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన ప్రోబా-3 ఉపగ్రహాలను నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఈ విజయవంతమైన ప్రయోగం తర్వాత ఈ ఏడాది ఇస్రో చేపట్టబోయే చివరి ప్రయోగం ఇదే.

# గోటితో పోయేదాన్ని గొడ్డలి దాకా తెచ్చారు

## సంధ్య థియేటర్ ఘటనపై పవన్ వ్యాఖ్యలు

అమరావతి, (ప్రభాత సూర్యుడు): గోటితో పోయే దాన్ని గొడ్డలి వరకూ తెచ్చారని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన, సినీనటుడు అల్లు అర్జున్ అరెస్ట్‌పై పవన్ కళ్యాణ్ స్పందించారు. మంగళగిరిలో మీడియాతో చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి గొప్ప నాయకుడుని, కిందిస్థాయి నుంచి ఎదిగారని కితాబునిచ్చారు. వైకాపా విధానాల తరహాలో అక్కడ వ్యవహరించలేదు. ఆ రాష్ట్రంలో బెనిఫిట్‌షోలకు అవకాశమిచ్చారు. టికెట్ ధర పెంపునకూ వెసులుబాటు కల్పించారు. ఆయన సహకారంతోనే సినిమాల కలెక్షన్లు పెరిగాయి. 'సలార్', 'పుష్ప2'వంటి సినిమాలకు భారీ వసూళ్లు వచ్చాయి. 'పుష్ప2' సినిమాకు సీఎం రేవంత్ పూర్తిగా సహకరించారు. టికెట్ రేట్ల పెంపునకు అవకాశం ఇవ్వడం కూడా చిత్ర పరిశ్రమను ప్రోత్సహించడమే అవుతుందని అన్నారు. అల్లు అర్జున్ విషయంలో తెర ముందు, వెనుక ఏం జరిగిందో నాకు పూర్తిగా తెలియదు. చట్టం అందరికీ సమానం. ఇలాంటి ఘటనల్లో పోలీసులను తప్పుపట్టను. భద్రత గురించే వారు ఆలోచిస్తారు. థియేటర్ స్టాఫ్ కూడా అల్లు అర్జున్‌కు ముందు చెప్పి ఉండాల్సింది. పోనీ, సీట్లో ఆయన కూర్చొన్నాక అయినా, చెప్పి తీసుకెళ్లాల్సిందని అన్నారు. అల్లు అర్జున్ తరఫున ఎవరో ఒకరు బాధిత కుటుంబం వద్దకు ముందే వెళ్లి ఉంటే బాగుండేది. ఈ ఘటనలో రేవతి చనిపోవడం నన్ను కలచి వేసింది. గోటితో పోయే దాన్ని గొడ్డలి వరకూ తెచ్చారు. మేమంతా అండగా ఉన్నామని ముందే చెప్పి ఉండాల్సింది. తమ ప్రమేయం లేకుండా తప్పు జరిగి పోయిందని విచారం వ్యక్తం చేయాల్సింది. ఈ విషయంలో ఎక్కడో మానవతా దృక్పథం లోపించింది. అందరూ రేవతి ఇంటికి వెళ్లి భరోసా ఇచ్చి ఉండాల్సింది. పరామర్శించకపోవడం వల్లే ప్రజల్లో ఆగ్రహం వచ్చింది. తన వల్లే ఒకరు చనిపోయారనే వేదన అర్జున్‌లో ఉంది' 'సినిమా అంటే టీమ్ అందరి భాగస్వామ్యం. అల్లు అర్జున్ ఒక్కడినే దోషిగా మార్చడం కూడా కరెక్ట్‌కాదు. తొక్కిసలాట ఘటన తర్వాత చోటు చేసుకున్న పరిణామాలపై సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి స్పందించారు. కొన్నిసార్లు పరిస్థితులను బట్టి నిర్ణయాలు ఉంటాయి. చిరంజీవి కూడా గతంలో అభిమానులతో కలిసి సినిమాలు చూసేందుకు వెళ్లేవారు. కాకపోతే ఆయన ముసుగు వేసుకుని ఒక్కరే థియేటర్‌కు వెళ్లేవారు. సినిమా పరిశ్రమలో మార్పు రావాల్సిన అవసరం ఉంది. పరిశ్రమలోని వారందరూ కూర్చొని మాట్లాడాలి. రాష్ట్రంలో పాపికొండలు వంటి చక్కటి లొకేషన్లు ఉన్నాయి. విజయనగరం అటవీ ప్రాంతంలోనూ అందమైన ప్రదేశాలున్నాయి. ఈ ప్రాంతాలకు మౌలిక సదుపాయాలు అవసరం. ఇండస్ట్రీలో క్వాలిటీ ఆఫ్ ఫిల్మ్ మేకింగ్ ఉండాలి. స్టోరీ టెల్లింగ్ స్కూల్స్ రావాలి. అప్పుడే మంచి సినిమాలు సాధ్యం' అని పవన్ కళ్యాణ్ అన్నారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



# గురుకులాలంటే ఎందుకింత నిర్లక్ష్యం?: కేటీఆర్

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): కాంగ్రెస్ ప్రభుత్వానికి గురుకులాలంటే ఎందుకింత నిర్లక్ష్యమో అర్థం కావడం లేదని, బీఆర్ఎస్ పాలనలో గురుకులు ఒక వెలుగు వెలిగితే ఇప్పుడు అంధకారంలో మగ్గుతున్నాయని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. పదేండ్లలో ఎవరెస్ట్ శిఖరమంత ఎత్తు ఎదిగిన గురుకులాల గౌరవం.. ఏడాదిలో ఎందుకు పడిపోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. గురుకులాలను ఉద్దేశపూర్వకంగా పక్కనపెట్టే ప్రయత్నం చేస్తున్నారా అని మండిపడ్డారు. ఇది కక్ష, శిక్ష్యా లేక నిర్లక్ష్యమా అని ఎక్స్ వేదికగా కాంగ్రెస్ సర్కార్‌ను నిలదీశారు. మండలానికి ఒక్క గురుకుల పాఠశాలకు మాత్రమే పరిమితం చేసే కుట్ర దాగి ఉందా అని సందేహం వ్యక్తం చేశారు. అందుకే ఉద్దేశపూర్వకంగా విద్యార్థుల్లో, విద్యార్థుల తల్లిదండ్రులలో అభద్రతా భావం పెంచుతున్నారా అన్నారు. ఏడాదిలో 50 మందికి పైగా విద్యార్థులు మరణించినా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని దుయ్యబట్టారు. ప్రతిష్ఠాత్మకంగా సీఎం నుంచి మంత్రుల వరకు కామన్ డైట్ అంటూ అట్టహాసంగా ప్రారంభించింది ఆరంభ శూరత్వమేనా అంటూ విమర్శించారు. కేసీఆర్ పాలనలో దేశానికి ఆదర్శం, నేడు అంతులేని నిర్లక్ష్యమంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు గురుకులాల నుండి పారిపోయే పరిస్థితికి కారణమెవ్వరని ప్రశ్నించారు.

# 2024 డిసెంబర్ విమానయానాలకు చీకటి నెల

## వివిధ ప్రాంతాల్లో ఏడు ఘోర ప్రమాదాలు ఏకంగా 240 మంది దుర్మరణం



న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు): 2024 ముగింపునకు చేరింది మరికొన్ని గంటల్లో కొత్త ఏడాదికి స్వాగతం పలికేందుకు ప్రపంచం మొత్తం సిద్ధమవుతోంది. అయితే, ఏడాది చివరి నెల డిసెంబర్ విమానయాన చరిత్రలో 'చీకటి నెల'గా నిలిచింది. ఎందుకంటే డిసెంబర్ నెలలో ఏకంగా ఏడు ఘోరమైన విమాన ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. మొత్తం ఏడు ప్రధాన ఘటనల్లో ఏకంగా 240 మంది మరణించడం కలచివేస్తోంది. ఈ ఒక్క నెలలో జరిగిన విమాన ప్రమాదాలు విమానయాన భద్రతపై పలు ప్రశ్నల్ని లేవనెతుతున్నాయి. దక్షిణ కొరియాలో ఆదివారం ఘోర విమాన ప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే. దాదాపు 179 మంది ప్రయాణికులు సజీవంగా దహనమయ్యారు. ల్యాండింగ్ అవుతున్న సమయంలో గేర్ పనిచేయకపోవడంతో విమానం వేగంగా రన్‌వేపై దూసుకువెళ్లి ఫెన్సింగ్ గోడను ఢీకొంది. వెంటనే విమానంలో మంటలు చెలరేగి అందులోని ఇద్దరు సిబ్బంది మినహా మొత్తం 179 మంది సజీవదహనం చెందారు. దక్షిణ కొరియా విమానయాన చరిత్రలోనే ఇది అత్యంత ఘోర ప్రమాదంగా భావిస్తున్నారు. డిసెంబర్ 25న అజర్‌బైజాన్ విమానం కూలిన ప్రమాదంలో 38 మంది ప్రాణాలు కోల్పోయారు. అజర్‌బైజాన్ రాజధాని బాకు నుంచి రష్యాలోని గ్రోజ్నీకి బయల్దేరిన విమానాన్ని పొగమంచు కారణంగా కజకిస్థాన్‌లోని అక్టౌ విమానాశ్రయానికి మరలించారు. విమానం దానికి దగ్గర్లో ల్యాండ్ అవుతున్నప్పుడు పక్షి ఢీకొనడంతో కుప్ప కూలి మంటలు చెలరేగాయి. ఆ సమయంలో విమానంలో 37 మంది అజర్‌బైజాన్ వాసులు, 16 మంది రష్యన్లు, ఆరుగురు కజకిస్థానీలు, ముగ్గురు కిర్గిస్థానీ పౌరులు ఉన్నారు. ఈ ఘటనలో 38 మంది దుర్మరణం పాలయ్యారు. 27 మంది గాయపడ్డారు. డిసెంబర్ 22న మూడు ప్రమాదాలు.. 19 మంది మృతి డిసెంబర్ 22న బ్రెజిల్‌లో సంభవించిన విమాన ప్రమాదంలో పది మంది ప్రాణాలు కోల్పోయారు. విదేశీ ప్రయాణికులతో వెళుతున్న ఓ బుల్లి విమానం ఆదివారం దక్షిణ బ్రెజిల్ టూరిస్ట్ సిటీ గ్రామాడోలోని దుకాణాల్లోకి దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో విమానంలో పది మంది ఉండగా.. వారంతా ప్రాణాలు కోల్పోయారు. క్రిస్మస్ పండుగకు కొద్ది రోజుల ముందు ఈ ఘటన జరిగింది. అందరూ పండుగ కోసం ముస్తాబవుతున్న నేపథ్యంలో ఈ ఘటన జరగడం స్థానికుల్లో విషాదాన్ని నింపింది. ఇక అదే రోజుటర్కీలో కూడా ఇలాంటి ప్రమాదమే సంభవించింది. వైద్యులతో బయల్దేరిన అంబులెన్స్ హెలికాప్టర్ ఘోర ప్రమాదానికి గురైంది. రోగిని తీసుకొచ్చేందుకు టేకాఫ్ అయిన హెలికాప్టర్ హాస్పిటల్ భవనాన్ని ఢీకొట్టి, కుప్పకూలింది. అందులో ఉన్న ఇద్దరు పైలట్లు, ఒక డాక్టర్, ఒక ఆరోగ్య సంరక్షకుడు చనిపోయారు. టర్కీ ఆగ్నేయప్రాంతంలోని ముగ్లా నగరంలో డిసెంబర్ 22 ఆదివారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. డిసెంబర్ 22న పాపువా న్యూ గునియాలో నార్త్ కోస్ట్ ఏవియేషన్ నిర్వహిస్తున్న చిన్న విమానం కూలి అందులో ఉన్న 5 మంది ప్రాణాలు కోల్పోయారు.



# రైతుబంధు ఇవ్వాలన్న కనీస సోయి కాంగ్రెస్‌కు లేదు

## రైతు కూలీలకు సాయం చేస్తానని మాట మార్చిండ్రు

## రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువు

## ప్రతీ ఐదు గంటలకొక మహిళ కిడ్నాప్ : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): రైతుబంధు ఇవ్వాలన్న సోయి ప్రభుత్వానికి లేదని ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసీఆర్ ప్రజలను కన్నబిడ్డలను చూసుకున్నట్లుగా చూసుకున్నారని తెలిపారు. కానీ, కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని.. రైతుబంధు ఇవ్వాలన్న సోయి ప్రభుత్వానికి లేదని మండిపడ్డారు. రైతు కూలీలకు కూడా సాయం చేస్తామన్న ప్రభుత్వం.. ఇప్పటికీ ఏం చేయలేదన్నారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదని.. రాష్ట్రంలో ప్రతీ మూడు గంటలకు మహిళలపై ఒక అత్యాచారం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతీ ఐదు గంటలకు ఒక మహిళా కిడ్నాప్ అవుతోందని.. మహిళా భద్రత కోసం కేసీఆర్ షీటీమ్స్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు పోలీసులు కాంగ్రెస్ నేతలు చుట్టూ తిరగడం తప్పా.. ఏం చేయడం లేదని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో పోలీసులు పీపుల్స్ ఫ్రెండ్లీగా ఉండేదని.. ఇప్పుడు కాంగ్రెస్ ఫ్రెండ్లీ పోలీసింగ్ జరుగుతోందని విమర్శించారు. రాష్ట్రంలో మహిళలకు కనీస భద్రత లేకపోవడం దారుణమని.. సీఎం రేవంత్ రెడ్డి మహిళా భద్రతపై ప్రత్యేకంగా సమీక్షించాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ ప్రజాస్వామ్యం, రాజ్యాంగమంటూ తిరుగుతుంటే.. రేవంత్ రెడ్డి మాత్రం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని ధ్వజమెత్తారు.

# మన్మోహన్ విజినరీ లీడర్: వివేక్

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): మన్మోహన్ సింగ్ ఒక విజనరీ లీడర్ అని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. అసెంబ్లీలో మన్మోహన్ మృతిపై సంతాప తీర్మానం సందర్భంగా మాట్లాడిన వివేక్.. దేశం రూపురేఖలు మార్చడంలో మన్మోహన్ కీ రోల్ పోషించారని చెప్పారు. మన్మోహన్ కు కాకా వెంకటస్వామికి మంచి అనుభందం ఉందన్నారు. రామగుండం ఫ్యాక్టరీ రీ ఓపెన్ కావడంలో మన్మోహన్ పాత్ర ఉందన్నారు. మన్మోహన్ హయాంలో దేశ జీడీపీ గ్రోత్ 8 ఉందన్నారు ఎమ్మెల్యే వివేక్. 2008లో ప్రపంచంలోని ఆర్థిక మాంద్యం ఎఫెక్ట్ భారత్ పై పడలేదన్నారు. మన్మోహన్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అని ఓబామా అన్నారని చెప్పారు. మన్మోహన్ హయాంలోనే యూఎస్ ట్రేడ్ పెరిగిందన్నారు వివేక్. మన్మోహన్ వల్లే ఐదు ట్రిలియన్ ఎకానమీ వైపు భారత్ పయనిస్తుందన్నారు. మన్మోహన్ సింగ్ వల్లే దేశంలో 2011 వరల్డ్ కప్ నిర్వహించారని.. క్రికెట్ మ్యాచ్ లకు రాయితీలు ఇచ్చారని వివేక్ చెప్పారు.

# ఏపీ నూతన సీఎస్‌గా విజయానంద్

## బీసీ అధికారి విజయానంద్‌కు సీఎస్‌గా అవకాశం

అమరావతి (ప్రభాత సూర్యుడు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా కె.విజయానంద్ నియమితులయ్యారు. 1992 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన విజయానంద్‌ను సీఎస్‌గా నియమిస్తూ ఆదివారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా విజయానంద్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ డిసెంబర్ 31తో పదవీవిరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో కొత్త సీఎస్‌గా విజయానంద్ బాధ్యతలు చేపడతారు. బీసీ అధికారి విజయానంద్‌కు సీఎస్‌గా అవకాశం ఇవ్వడంతో టీడీపీ నేతలతో పాటు ప్రభుత్వ వర్గాల్లో పెద్ద చర్చ నడుస్తోంది. 1992 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన బీసీ అధికారికి సీఎం చంద్రబాబు టాప్ పోస్ట్ ఇచ్చారని పలువురు టీడీపీ నేతలు, ప్రభుత్వ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. చంద్రబాబు నాయకత్వంలో బీసీ నేతలకు, అధికారులకు ఎప్పుడూ సమున్నత గౌరవం దక్కుతుందని అధికారులు అంటున్నారు. ఉమ్మడి ఏపీలో గానీ, నవ్యాంధ్రలో గానీ ఇప్పటి వరకు బీసీలకు సీఎస్ పోస్టు దక్కలేదని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. తొలిసారి బీసీ అధికారికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించిన సీఎంపై ప్రశంసలు కురిపిస్తున్నారు. బీసీలకు నారా చంద్రబాబు ఎప్పుడూ పెద్దపీట వేస్తారని నేతలు, అధికారులు అంటున్నారు. అత్యంత



ప్రాధాన్యత కలిగిన టీటీడీ ఈవోగా బీసీ అధికారిగా శ్యామల రావు నియామకం జరిగిందంటున్నారు. అటు ప్రభుత్వంలోను, పార్టీలోనూ బీసీలకు చంద్రబాబు సముచిత స్థానం ఇచ్చారని నేతలు చర్చించుకుంటున్నారు. తెలుగు దేశం రాష్ట్ర పార్టీ అధ్యక్షునిగా బీసీ నేత పల్లా శ్రీనివాస్‌కు అవకాశం ఇచ్చారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. శాసన సభ స్పీకర్‌గా మరో సీనియర్ నేత చింతకాలయ అయ్యన్న పాత్రుడుకు అవకాశం వచ్చిందంటున్నారు. వైసీపీ ప్రభుత్వంలో సీఎస్, డీజీపీ సహా అన్ని కీలక స్థానాల్లో తన సామాజిక వర్గానికి చెందిన వాళ్లనే వైఎస్ జగన్ నియమించారని టీడీపీ నేతలు విమర్శిస్తున్నారు.



# మన్మోహన్‌సింగ్ అస్తికలను యమునా నదిలో కలిపిన కుటుంబ సభ్యులు

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): మాజీ ప్రధానమంత్రి, ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ మరణించిన విషయం తెలిసిందే. ఈనెల 26న ఢిల్లీలోని ఎయిమ్స్‌లో తుదిశ్వాస విడిచారు. ఢిల్లీలోని నిగమ్‌బోధ్ ఘాట్‌లో శనివారం ఆయన అంత్యక్రియలు జరిగాయి. కేంద్రం అధికార లాంఛనాలతో ఆయనకు తుది వీడ్కోలు పలికింది. మన్మోహన్ పెద్ద కూతురు ఉపిందర్ సింగ్ తన తండ్రికి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో తాజాగా మన్మోహన్ అస్తికలను కుటుంబ సభ్యులు యమునా నదిలో కలిపారు. మజ్ను కా తిలా గురుద్వారా సమీపంలోని అష్ట్ ఘాట్ వద్ద సిక్కు సంప్రదాయాలను అనుసరించి ఆదివారం ఆయన అస్తికలను నదిలో నిమజ్జనం చేశారు. మన్మోహన్ సింగ్ సతీమణి, ముగ్గురు కుమార్తెలు, ఇతర కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మన్మోహన్ సింగ్‌కు ఢిల్లీలో స్మారకాన్ని నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనువైన స్థలాన్ని త్వరలోనే నిర్ణయిస్తామని పేర్కొన్నది. కాగా, స్మారక నిర్మాణం జరగనున్న స్థలంలోనే అంత్యక్రియలు జరపాలని అంతకుముందు కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. మన్మోహన్ అంత్యక్రియలు, స్మారకానికి స్థలాన్ని నిర్ణయించకుండా బీజేపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే దేశ తొలి సిక్కు ప్రధానమంత్రిని అవమానిస్తున్నదని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది.

# కాశ్మీర్‌ను కప్పేసిన మంచు దుప్పటి

## యూనివర్సిటీ పరీక్షలన్నీ వాయిదా

శ్రీనగర్ (ప్రభాత సూర్యుడు): కాశ్మీర్‌లో హిమపాతం కారణంగా భారీగా మంచు కురుస్తోంది. దీంతో అక్కడి ప్రభుత్వం పరీక్షలను రద్దు చేసింది. డిసెంబర్ 30న జరగాల్సిన కాశ్మీర్ యూనివర్సిటీ పరీక్షలన్నీ వాయిదా పడ్డాయి. కాశ్మీర్‌లోని చాలా ప్రాంతాల్లో ముఖ్యంగా ఉత్తర, దక్షిణ ప్రాంతాలలో విపరీతమైన మంచు కురుస్తున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ మజిద్ జమాన్ తెలిపారు. పరీక్షలను సకాలంలో నిర్వహిస్తామన్నారు. వాయిదా పడిన పరీక్షలకు కొత్త తేదీలు విడిగా జారీ చేయబడతాయన్నారు. కొత్త సంవత్సరానికి ముందు జమ్మూ కశ్మీర్‌లో మంచు భారీగా కురుస్తోంది. ఈ ప్రభావం జనవరి 1, 2 తేదీల్లో కూడా ఉంటుందని, కొన్ని కొండ ప్రాంతాలు, మైదాన ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశాలు కూడా ఉన్నాయని వెదర్ రిపోర్ట్ అధికారులు ప్రకటించారు. ఆ తర్వాత జనవరి 3, 6 తేదీల మధ్య కశ్మీర్ డివిజన్‌లోని కొన్ని ప్రాంతాలలో భారీ హిమపాతం ఉండవచ్చని వెల్లడించారు. దీంతో జమ్మూ డివిజన్‌లోని అనేక ప్రాంతాలు కూడా ప్రభావితం కానున్నాయి. వాతావరణం అధ్వాన్నంగా ఉన్న నేపథ్యంలో ఆదివారం అనేక ప్రాంతాల్లో పెద్ద ఎత్తున హిమపాతం కురిసింది. ఆ క్రమంలో మంచు తొలగింపు తర్వాత రెండో రోజు జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు పునరుద్ధరించబడ్డాయి. దీంతోపాటు దారిలో నిలిచిన వాహనాలను గమ్యస్థానం వైపు పంపించారు. బనిహాల్, ఖాజిగుండ్ మధ్య రోడ్లు జారడం కారణంగా, డ్రైవర్లు నెమ్మదిగా నడపాలని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇదే



సమయంలో సింథాన్ రోడ్, సోన్‌మార్గ్-కార్గిల్ రోడ్, భదేర్వా-చంబా రోడ్‌తో పాటు జిల్లా రాజోరి, పూంచ్ నుంచి షోపియాన్ (కశ్మీర్) వరకు కలిపే మొఘల్ రోడ్‌లు ఇంకా మంచుతోనే ఉన్నాయి. వీటిని ఇంకా తెరువలేదు. వాతావరణం మెరుగుపడిన తరువాత శ్రీనగర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమాన కార్యకలాపాలు పునఃప్రారంభించబడ్డాయి. పర్యాటకులు, ప్రయాణికులు ట్రాఫిక్ విభాగం సలహా ప్రకారం ప్రయాణించాలని సూచించారు. అలాగే నేటి నుంచి రైలు సర్వీసులను కూడా పునరుద్ధరించారు. అయితే ఈ రోజు విస్టాడోమ్ సేవలు రద్దు చేయబడ్డాయి.
ఈ క్రమంలో లోయలోని చాలా జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రత సాధారణం కంటే 2 నుంచి 6 డిగ్రీలు తక్కువగా ఉంది. ఆదివారం రాజధాని శ్రీనగర్‌లో గరిష్ట ఉష్ణోగ్రత 4.7 డిగ్రీల నుంచి 4.2 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. పహల్గామ్‌లో 5.8 డిగ్రీలు, గుల్‌మార్గ్‌లో 5.3 డిగ్రీల నుంచి మైనస్ 2.0 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. జమ్మూలో గరిష్ట ఉష్ణోగ్రత 20.5 కాగా, కనిష్ట ఉష్ణోగ్రత 6.1 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. బనిహాల్‌లో 6.1 డిగ్రీల సెల్సియస్, బాటోట్‌లో 7.9, కత్రాలో 18.0, భదర్వాలో 10.0 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. లేహ్‌లో గరిష్ట ఉష్ణోగ్రత 0.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. గుల్మార్గ్‌లో పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు సున్నా కంటే తక్కువగా ఉండటం విశేషం.



# లైంగిక దాడి ఘటన నేపథ్యంలో గవర్నర్‌ను కలిసిన నటుడు విజయ్


చెన్నై, (ప్రభాత సూర్యుడు): అన్నా యూనివర్సిటీలో విద్యార్థినిపై లైంగిక దాడి ఘటన తమిళనాడులో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ ఘటనకు పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. వివిధ పార్టీలు, సంఘాలు అన్నా యూనివర్సిటీ ముందు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ఘటనకు వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇవాళ తమిళగ వెట్రి కజగమ్ పార్టీ అధ్యక్షుడు, నటుడు విజయ్ తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిని కలిశారు. రాష్ట్రంలోని పరిస్థితుల నేపథ్యంలో లైంగిక దాడి ఘటనపై మాట్లాడేందుకే విజయ్ గవర్నర్‌ను కలిసినట్లు తెలుస్తోంది. అయితే నటుడు విజయ్ ఈ లైంగిక దాడి ఘటనపై ఇప్పటికే స్పందించారు. అన్నా యూనివర్సిటీ ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, చాలా బాధించిందని నటుడు విజయ్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారని, నిందితుడిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తాను ప్రభుత్వాన్ని కోరానని, ఈ ఘటనలో ఇంకా ఎవరి హస్తమున్నా తగిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశానని ఆయన తన పోస్టులో తెలిపారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## సంపాదకీయం EDITORIAL

# రుణాల ఎగవేతదారులపై చర్యలేవీ!

మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత దేశాన్ని దాటిన పలువురు బ్యాంక్ రుణాల ఎగవేతదారులను ఇప్పటికీ పట్టుకోలేక పోయారు. విజయమ్ మాల్యా,నీరవ్ మోడీ వంటివారు విదేశాల్లో తలదాచుకుని బాగా ఎంజాయ్ చేస్తున్నారు. రుణాలను ఎగవేసి నింపాదిగా దేశం దాటినా వారిని వెనక్కి రప్పించలేక పోయారు. అప్పులు చేసి ఎగవేసి, దేశం విడిచిన వారి బతుకులే హాయిగా ఉన్నాయి. దేశంకోసం కష్టపడి పనిచేస్తూ ఉన్న ప్రజలు మాత్రం పన్నుల ఊబిలో చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. పన్నులు, ధరల భారతంతో దేశం అతలాకుతలం అవుతోంది. దివంతగత ప్రధాని మన్మోహన్ పదేళ్ల కాలం నాటి పరిస్థితితులకు మోడీ పదేళ్ల పాలను తేడాను గమనిస్తే ..ధరలు, పన్నులు ఎంతగా పెరగాయో గమనించవచ్చు. ఆర్‌బిఐ అందించిన లెక్కల ప్రకారమే 2020లో 2,154 గా ఉన్న ఉద్దేశపూర్వక ఎగవేతదారులు 2024కి వచ్చేసరికి 2,664కు పెరిగిపోయారు. బ్యాంకులకు లక్షల కోట్ల రూపాయలు ఎగవేసే కార్పొరేట్ల నుంచి వాటిని రికవరీ చేయడానికి బదులు, ఈ కంపెనీలకు ప్రతి యేటా లక్షల కోట్ల రూపాయల రుణాలను మాఫీ చేస్తోంది. అదే సమయంలో దేశానికి అన్నం పెట్టే రైతులు సంక్షోభంలో ఉన్నారు, వారి రుణాలను మాఫీ చేయమంటే కుదరదు పొమ్మంటోంది. క్రోనీ కేపిటలిస్టులు, కార్పొరేట్లకు ప్రజల సొమ్ము దోచిపెట్టడం వల్ల బ్యాంకులకు కలిగే నష్టాలను భర్తీ చేసేందుకు డిపాజిట్లపై వడ్డీ రేట్ల తగ్గింపు, మినిమమ్ బ్యాలెన్స్ లేకుంటే పెనాల్టీలు, ప్రభుత్వ రంగ సంస్థలకు ఇచ్చే రుణాలపై అధిక వడ్డీ వసూలు వంటి పద్ధతులు అవలంభిస్తున్నాయి. బ్యాంకులను ముంచేస్తున్న వారిపై మాత్రం ఎలాంటి క్రిమినల్ ప్రొసీజర్స్ ఉండడం లేదు. బ్యాంకులకు వీరు ఎగ్గొట్టిన మొత్తం ఈ కాలంలో లక్షా 52 వేల 860 కోట్ల రూపాయల నుంచి లక్షా 96 వేల కోట్ల 441 కోట్ల రూపాయలకు చేరింది. ఇదంతా సామాన్యులు బ్యాంకుల్లో చేసుకున్న డిపాజిట్ల సొమ్మే. ఇప్పటికీ బ్యాంకు మొత్తం డిపాజిట్లలో 75 శాతం దాకా సామాన్యుల నుంచి సేకరించినవేనని ఆర్‌బిఐ నివేదికలే చెబుతున్నాయి. సామాన్యులు దాచుకున్న సొమ్మును లూటీ చేస్తున్న ఆర్థిక నేరగాళ్లలో చాలా వరకు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి సన్నిహితులైన వ్యక్తులు, కార్పొరేట్ సంస్థలే. ఈ రుణ ఎగవేతదారుల్లో చాలా మంది నేరపూరిత కార్యకలాపాలకు పాల్పడినవారున్నారు. ఇటువంటి వారిని శిక్షించాల్సిన ప్రభుత్వం, ఆర్‌బిఐలే వారికి రక్షణగా ఉంటున్నాయి. సామాన్యులు, మధ్యతరగతి డిపాజిటర్లు పొదుపు చేసిన సొమ్ము ఉద్దేశపూర్వక ఎగవేతదారుల పాలవుతోంది. బ్యాంకులకు రుణబకాయిలు చెల్లించే అవకాశం ఉన్నప్పటికీ, ఉద్దేశపూర్వకంగా ఎగవేసే క్రోనీ కేపిటలిస్టులు, కార్పొరేట్లు మోడీ ఏలుబడిలో రోజురోజుకూ పెరిగిపోతున్నారు. 2023 జూన్ 3న ఆర్‌బిఐ జారీ చేసిన సర్క్యులర్‌లో ఉద్దేశ పూర్వక ఎగవేతదారులు, ఆర్థిక మోసాలకు పాల్పడినవారితో రాజీ ఒప్పందాలు కుదుర్చుకోవాలని బ్యాంకులకు సూచించింది.







2016లో తీసుకొచ్చిన దివాలా కోడ్ బ్యాడ్ లోన్స్‌ను థర్డ్ పార్టీకి విక్రయించాలని బ్యాంకులను ఆదేశిస్తోంది. మాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) ద్వారా దాఖలు చేసిన అర్జీకి ప్రతిస్పందనగా టాప్ 100 మంది ఉద్దేశపూర్వక ఎగవేతదారుల వివరాలను ఆర్‌బిఐ వెల్లడించి చేతులు దులిపేసుకుంది. 2018లో దేశం విడిచి పారిపోయిన నీరవ్‌మోడీకి చెందిన గీతాంజలి జెమ్స్ బ్యాంకులకు రూ.8,516 కోట్లు బకాయి పడింది. ఇదే అత్యధిక మొత్తం ఎగవేతదారుగా ఉంది. ఇప్పుడే కాదు, ఇంతకుముందు కూడా అది భారీగా రుణాన్ని ఎగవేసింది. ఎన్ని సార్లు ఎగవేసినా ఏమీ కాదు అన్న వాతావరణాన్ని ప్రభుత్వమే కల్పించాక ఎగవేత దారులు పెరగకుండా ఎలా ఉంటారు. గత పదేళ్లలో మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు మాఫీ చేసిన రుణాలు అక్షరాలా 16.11 లక్షల కోట్ల రూపాయలు. అంతకుముందు మన్మోహన్ సింగ్ ప్రభుత్వం పదేళ్లలో మాఫీ చేసినదాంతో పోల్చితే ఇది ఎనిమిది రెట్లు ఎక్కువ. వామపక్షాల ఒత్తిడి ఫలితంగా యుపిఏ-1 ప్రభుత్వం అప్పట్లో రూ. 60 వేల కోట్ల మేర వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తే ఇది దండగమారిన చర్యగా గగ్గోలు పెట్టిన 'ప్రధాన స్రవంతి మీడియా' ఈ రుణ ఎగవేతలపై ఒక్క ముక్క కూడా ప్రస్తావించడం లేదు. అమెరికా లాంటి దేశాల్లో పారుబకాయిలు ఒక శాతం కంటే తక్కువగా ఉంటే భారత్‌లో ఇది 7.85 శాతంగా ఉన్నాయి. ఆర్‌బిఐ మార్గదర్శకాల ప్రకారం బ్యాంకులు ఇచ్చే మొత్తం రుణాల్లో వ్యవసాయ రంగానికి 40 శాతం ఇవ్వాలి. కానీ, 12 శాతానికి మించి ఇవ్వడం లేదు. క్రోనీ కేపిటలిస్టులు, కార్పొరేట్ల పట్ల వున్న ప్రేమ వ్యవసాయంపై మోడీ ప్రభుత్వానికి లేదనడానికి ఇదొక నిదర్శనం. ప్రభుత్వ రంగ బ్యాంకులను ఒక వైపు ప్రైవేటీకరిస్తూ, ఇంకో వైపు ఉన్న బ్యాంకులను కూడా దివాలా తీయించే చర్యలు ప్రభుత్వం చేపడుతోంది. దీనికి వ్యతిరేకంగా బ్యాంకు సిబ్బంది పలుమార్లు సమ్మె చేసినా ప్రభుత్వం లెక్కచేయడం లేదు. ఈ స్థితిలో బ్యాంకులకు పెద్ద యెత్తున రుణాలను ఉద్దేశపూర్వకంగా ఎగవేసిన వారి నుంచి తిరిగి రాబట్టేలా చూసేందుకు బ్యాంకు ఉద్యోగులతోబాటు ప్రజలు పెద్దయెత్తున ఉద్యమించాలి. ఆర్థిక నేరగాళ్లను బోనులో నిలబెట్టాలి. అప్పుడే దేశ ఆర్థిక వ్యవస్థపై భారం తప్పుతుంది. ఇకపోతే పన్నుల విధానం సవరించకుండా ముందుకు సాగలేం. ద్రవ్యోల్బణం పెరుగుతోంది. రూపాయి విలువ రోజురోజుకూ దిగజారుతోంది. ఈ పరిస్థితిలో పివి అనుసరించిన మార్గం మేరకు మరో ఆర్థికవేత్త రావాల్సి ఉంది. అప్పుడే భారత్ ఆర్థికరంగం పురోగమించగలదు.

# ఊరిస్తున్న మంత్రివర్గ విస్తరణ

### ఏడాదైనా కనికరించని కాంగ్రెస్ అధిష్టానం నిరాశలో ఆశావహులు



రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నది. తర్వాత మంత్రి వర్గ విస్తరణ రేపుమాపు ఉంటుందంటూ ఏడాదికాలంగా వినిపిస్తున్నా..ఇప్పటివరకూ ఎలాంటి ప్రకటనా లేదు. ఢిల్లీకి ఎన్ని చక్కర్లు కొట్టినా సిఎం రేవంత్‌కు మోక్షం కలగడం లేదు. ఆయన అభ్యర్థనలను అధినేతలు పట్టించుకోవడం లేదు. మంత్రి పదవిపై ఎమ్మెల్యేలు ఎన్నో ఆశలు పెట్టుకోగా.. సాగదీత పరిస్థితిలో రోజుకొకరు తెర మీదకు వస్తున్నారు. రేసులో నేనున్నానంటూ ముందుకు వచ్చి ఆందోళనలు చేస్తున్నారు.త్వరలో మంత్రివర్గ విస్తరణ అంటూ వార్తలు వస్తుండడం..టీవీ సీరియల్‌ను తలపిస్తున్నాయని ఆ పార్టీ నేతలే గుసగుసలాడుకోవడం గమనార్హం.మంత్రి పదవిని ఆశిస్తున్న వారంతా కళ్లలో వత్తులు వేసుకుని ఎదురు చూస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత తొలిసారి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతలు తీవ్రంగా ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తున్నారు. ఏడాదిగా ఇదే విషయమై ఢిల్లీ దాకా పైరవీలు చేస్తున్నారు. రోజుకొకరు తెర మీదికి వచ్చి మంత్రి పదవిని ఆశిస్తున్న నేపథ్యంలో పోటీ రోజురోజుకూ పెరుగుతున్నది. ఆశావహుల సంఖ్య భారీగా పెరుగుతోంది. ఆశించడం తప్పం కాదన్నట్లుగా ఏఐసీసీ దాకా మంత్రి పదవి కోసం ఎమ్మెల్యేలు కాని వారు కూడా దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. దీంతో మొదటి జాబితాలోనే పేరున్న వారిలో ఈ కొత్త పరిణామాలు ఒకింత ఇబ్బందికి గురి చేస్తున్నాయి. చూస్తుండగానే ఏడాది కాలం కరిగి పోయింది. మంత్రి పదవిని ఆశిస్తున్న వారంతా కళ్లలో వత్తులు వేసుకుని ఎదురు చూస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత తొలిసారి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతలు తీవ్రంగా ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తున్నారు. ఏడాదిగా ఇదే విషయమై ఢిల్లీ దాకా పైరవీలు చేస్తున్నారు. రోజుకొకరు తెర మీదికి వచ్చి మంత్రి పదవిని ఆశిస్తున్న నేపథ్యంలో పోటీ రోజురోజుకూ పెరుగుతున్నది. ఆశావహుల సంఖ్య భారీగా పెరుగుతోంది.ఆశించడం తప్పం కాదన్నట్లుగా ఏఐసీసీ దాకా మంత్రి పదవి కోసం ఎమ్మెల్యేలు కాని వారు కూడా దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. దీంతో మొదటి జాబితాలోనే పేరున్న వారిలో ఈ కొత్త పరిణామాలు ఒకింత ఇబ్బందికి గురి చేస్తున్నాయి. చూస్తుండగానే ఏడాది కాలం కరిగి పోయింది. ప్రభుత్వం వస్తే పదవి గ్యారంటీ అని కొందరు మొదట్నుంచి ఆశిస్తూ వస్తున్నారు. కానీ అందుకు విరుద్ధమైన పరిస్థితి ఇప్పుడు ఎదురవుతోంది. ఏకంగా దళిత సామాజిక వర్గం కోటాలో మంత్రి పదవిని ఆశిస్తున్నట్లు కొందరు చెప్పుకుంటున్నాయి. ఇలా ఎవరికి వారు మంత్రి పదవి కోసం తలబడుతుండడంతో రాజకీయం రసవత్తరం గా మారింది. 2024 సంక్రాంతి నుంచి మొదలైన ఈ పోటీ 2025 సంక్రాంతి వస్తున్నా ముగింపు కార్డు మాత్రం పడలేదు. 2023, డిసెంబర్ 7న పది మంది మంత్రులతో కలిసి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. తదనంతరం రేపు మాపు అంటూ వాయిదాలు మినహా ఆశావహులకు భరోసా దక్కడం లేదు. ఇకపోతే మంత్రివర్గంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి ఎవరికీ అమాత్యయోగం కలుగలేదు. దీంతో ఉమ్మడి జిల్లాకు పెద్ద దిక్కులేకుండా పోయింది. నలుగురు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ ఎవరికీ మంత్రివర్గంలో స్థానం లభించలేదు. అసలు మంత్రి వర్గ విస్తరణ ఉంటుందా అనేది జవాబు లేని ప్రశ్నగా మిగిలింది. సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి.సుదర్శన్ రెడ్డికే మంత్రి యోగం తథ్యమన్న సంకేతాలు కాంగ్రెస్ పార్టీలో ఉన్నాయి. పెద్దాయనకే అమాత్య యోగం దక్కుతుందని అంతా అనుకుంటున్నారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమేనంటూ సుదర్శన్ రెడ్డి కూడా అనేక సందర్భాల్లో చెప్పుకుంటున్నప్పటికీ ఎప్పుడన్నది తెలియడంలేదు. ఏ పదవీ లేకుండానే ఎమ్మెల్యేగానే కొనసాగుతుండడంతో జిల్లాకు చెందిన సీనియర్ ఎమ్మెల్యేకు సైతం మింగుడు పడటం లేదు. శాసనసభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న సమయంలోనే ఇదే తనకు చివరి ఎన్నికలుగా సుదర్శన్ రెడ్డి ప్రకటించుకున్నారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో వాస్తవానికి సుదర్శన్ రెడ్డికి ఎవ్వరూ పోటీలేరు. గెలిచిన నలుగురు ఎమ్మెల్యేల్లో సీనియారిటీ, కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా ఆయనకే అర్హతలు ఉన్నాయి. అయినప్పటికీ మంత్రి పదవి విషయంలో మాజీమంత్రికి అవకాశం దక్కడం లేదు. కొద్ది కాలం క్రితం వరకు మంత్రి పదవి వచ్చేస్తుందనుకుని ఆయన కొంత దూకుడు ప్రదర్శించారు. ఉమ్మడి జిల్లా ప్రభుత్వ యంత్రాంగంతో సమీక్షలు, సమావేశాలు నిర్వహించి హల్‌చల్ చేశారు. తీరా మంత్రి వర్గ విస్తరణలో జాప్యంతో కినుక వహించి అంటి ముట్టనట్లుగానే ఉంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. సుదర్శన్ రెడ్డి అనుచరవర్గం సైతం ఈ విషయంలో ఒకింత అసహనంతో ఉన్నట్లు తెలుస్తోంది. నిజామాబాద్ జిల్లాలో బోధన్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలుపొందారు. వీరిలో భూపతి రెడ్డి తొలిసారి చట్ట సభకు ఎన్నికయ్యారు. గతంలో ఎమ్మెల్సీగా పని చేసిన అనుభవం ఉన్నప్పటికీ ఇప్పుడు నేరుగా శాసనసభలో అడుగు పెట్టారు. ఇక బోధన్ నుంచి సీనియర్ నేత సుదర్శన్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరిలో ఇద్దరు నేతలు మంత్రి పదవి కోసం విన్నపాలు చేసుకున్నట్లుగా తెలుస్తోంది. కామారెడ్డి జిల్లా నుంచి ఎల్లారెడ్డి, జుక్కల్ శాసనసభ్యులు ఇరువురు తొలిసారి అసెంబ్లీకి ఎన్నుకోబడ్డారు. పీసీసీ చీఫ్‌గా పార్టీ పదవిని దక్కించుకున్న మహేశ్‌కుమార్ గౌడ్ సైతం బీసీ కోటాలో మంత్రి పదవి అడిగినట్లుగా గుసగుసలు వినిపిస్తున్నాయి. షబ్బీర్ అలీ సైతం తన చివరి రాజకీయ మజిలీలో మంత్రి యోగం కోసం మైనార్టీ కోటాలో పట్టుబడుతున్నాడు. మొత్తానికి ఉమ్మడి జిల్లా రాజకీయాలను ప్రభావితం చేసే మంత్రి పదవి కోసం కాంగ్రెస్‌లో భారీగా పోటీ నెలకొంది.

# జమిలి ఎన్నికల కోసం వైకాపాలో తొందర

### త్వరగా అధికారం దక్కుతుందనే ఆశ.. కూటమి ప్రభుత్వం విఫలమైందన్న ప్రచారం

**అమరావతి, (ప్రభాత సూర్యుడు):** సమిలి ఎన్నికలు త్వరగా రావాలని మోడీకన్నా..జగనే ఎక్కువగా కోరుకుంటున్నారు. ఎంత త్వరరగా ఎన్నికలు వస్తే తాను అంత త్వరగా సిఎం అయిపోతానని కలలు కంటున్నారు. అందుకే విద్యుత్ ఉద్యమంతో అడుగులు వేశారు. ఈప్రభుత్వంలో శాంతిభద్రతలు దెబ్బతిన్నాయని, విద్యుత్ ఛార్జీలు పెంచుతున్నారని విమర్శలకు పదును పెట్టారు. సమిలి ఎన్నికలు వస్తే కూటామి ప్రభుత్వం కూలి పోవడం ఖాయమని పార్టీ నేతలు బహిరంగంగానే ప్రకటించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి కేవలం ఆరు నెలలు మాత్రమే అయ్యింది. చేసిన అప్పులను,తప్పులను వెలికి తీసే ప్రయత్నంలో గత వైకాపా అవినీతి భారీగా బయటపడుతోంది. ఈ క్రమంలో వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి సార్వత్రిక ఎన్నికల యుద్ధంలో ఘోర పరాజయం తర్వాత మరో యుద్ధానికి సిద్ధం కావాలంటూ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మళ్లీ శాసనసభ ఎన్నికలకు నాలుగున్నరేళ్ల సమయం ఉంది. స్థానిక సంస్థల ఎన్నికలకు సైతం దాదాపు మరో ఏడాది సమయం ఉంది. ప్రస్తుతం ఎన్నికల సమయం కాకపోయినా ప్రభుత్వంపై యుద్ధానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వైసిపి కార్యకర్తల్లో ఉత్సాహం నింపేందుకు.. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జగన్ అడుగులు వేస్తున్నారు. అదే సమయంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు పూర్తి చేసుకున్న క్రమంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రజల విశ్వాసం కోల్పోయిందని విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వంపై ప్రజలు సంతృప్తిగా ఉన్నట్లు చర్చ జరుగుతున్న వేళ వైసీపీ నేతలు మాత్రం ప్రభుత్వంపై విమర్శలతో ముందుకు సాగుతున్నారు. ఓ వైపు విద్యుత్ రంగం దివాళా, బియ్యం కుంభకోణం వంటివన్నీ బయటపడుతున్నాయి. ఆనాటి మంత్రుల అవనితి తన్నుకు వస్తోంది. ఈ క్రమంలో వైసీపీ సీనియర్లు ఒక్కొక్కరు వైసీపీకి గుడ్‌బై చెబుతున్నారు. వలసలను నివారించడంలో జగన్ విఫలమయ్యారనే చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో కార్యకర్తల్లో ఉత్సాహం నింపేందుకు.. వారిని చురుకుగా ఉంచేసేదుకు జగన్ తన వంతు ప్రయత్నాలు ప్రారంభించారు.




# రైతుభరోసాపై కొలిక్కిరాని కసరత్తు

**హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు):** రైతుభరోసాపై ఇప్పటికీ ప్రభుత్వం వద్ద స్పష్టత కానరావడం లేదు. అసలుసిసలు రైతులకే భరోసా అని ప్రచారం చేస్తున్నా..అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా స్పష్టత ఇవ్వడం లేదు. ఏడాదైనా విధివిధానాలు రూపందించలేదు. భూమి ఉన్నంత మాత్రాన భరోసా ఇవ్వకుండా సన్నచిన్నకారు రైతులను గుర్తించి ఇవ్వడం ద్వారా ప్రభుత్వ ఖజానాపై భారం లేకుండా చేయాలి. సంక్రాంతి పండుగ తర్వాతే అన్నదాతల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే ప్రకటించగా.. దీని అమలు చేసే దిశగా ప్రభుత్వం కసరత్తు ప్రారంభించినా విధివిధానాలపై స్పష్టత లేదు.సాగుభూమికే రైతు భరోసా ఇవ్వాలనే యోచనలో ఉన్న ప్రభుత్వం ఎన్ని ఎకరాల వరకూ అమలు చేయాలనే దానిపై ఓ స్పష్టతకు ఇంకా రానట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మరోసారి భేటీ అయ్యి చర్చించనుంది. అటు.. ట్యాక్స్ పేయర్స్, ప్రభుత్వ ఉద్యోగులను రైతు భరోసాకు అనర్హులుగా ప్రకటించాలని నిర్ణయించినట్లు సమాచారం. దీనిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. గూగుల్ డేటా, శాటిలైట్ ఆధారంగా సాగు విస్తీర్ణం లెక్కించేందుకు పలు కంపెనీల నుంచి సమాచారం సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. సచివాలయంలో రైతు భరోసాపై ఆదివారం సబ్ కమిటీ భేటీ అయ్యింది. కమిటీ ఛైర్మన్ భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు, కమిటీ సభ్యులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. రైతు భరోసా ఇచ్చేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. రానున్న యాసంగి పంటకు రైతు భరోసా అందించేందుకు ఖరారు చేయాల్సిన విధి విధానాలపై మంత్రులు కసరత్తు చేశారు. పథకం ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకూ రైతు భరోసా అందించిన తీరు.. క్యాబినెట్ సబ్ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా పర్యటించిన క్రమంలో రైతులు వ్యక్తం చేసిన అభిప్రాయాలు, అధికారులు సేకరించిన సమాచారంపై సుదీర్ఘంగా చర్చించారు. అయితే, రైతు భరోసా విధి విధానాలపై మరోసారి భేటీ కావాలని సబ్ కమిటీ నిర్ణయించింది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా ఇచ్చిన మాట ప్రకారమే ముందుకు వెళ్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. 'ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసా ఇచ్చి తీరుతాం. రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రభుత్వం రూ.72,659 కోట్లు కేటాయించింది. రైతు రుణ మాఫీ కింద 2 నెలల వ్యవధిలోనే రూ.21 వేల కోట్ల నగదును రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేలా రైతుల సంక్షేమానికి కృషి చేసేందుకు వ్యవసాయ కమిషన్ ఏర్పాటు చేశాం. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన రైతువేదికలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకు రావాలని నిర్ణయించారు.110 రైతు వేదికల్లో రూ.4 కోట్లకు పైగా నిధులు వెచ్చించి వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లు ఏర్పాటు చేశారు. పంటల బీమా పథకం కింద ప్రీమియం మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే రైతుల పక్షాన చెల్లిస్తుంది. ఈ ఏడాది లక్ష ఎకరాల ఆయిల్ ఫామ్ సాగు చేపట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 2023 - 24 ఏడాదికి ఆయిల్ సాగు పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.80.10 కోట్లు విడుదల చేయగా.. రాష్ట్ర వాటా కలుపుకొని మొత్తంగా రూ.133.5 కోట్లు విడుదల చేశాం. రైతుల నుంచి కొనుగోలు చేసే సన్నధాన్యానికి 500 బోనస్ ప్రకటించారు. అయితే రైతులకు ఇకముందు రుణమాఫీలు లేకుండా స్పష్టమైన వ్యవసాయ విధానలతో ముందుకు సాగాల్సి ఉంది. ఇకపోతే ఖరీఫ్ రైతులకు తెలంగాణ ప్రభుత్వం చేదు వార్త వినిపించింది. ఈ ఖరీఫ్ సీజన్ కు రైతు భరోసా ఇవ్వబోమని తెలిపింది. ఈ మేరకు మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. రైతు భరోసాకు బదులుగా ప్రతీ సన్న ధాన్యం పండించిన రైతుకు 500 రూపాయల బోనస్ ఇస్తామని తుమ్మల ప్రకటించారు. పంట వేసిన రైతుకే రైతు భరోసా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లుగా ఆయన తెలిపారు. వ్యవసాయం చేయని వారికి రైతు భరోసా ఇవ్వబోమని తేల్చి చెప్పారు. ఈ ఖరీఫ్ సీజన్ కు రైతు భరోసా ఇవ్వలేము. మార్పులకు అనుగుణంగా రైతులను మారుస్తాం. ఆర్థిక వెసులుబాటు లేకపోయినా ముఖ్యమంత్రి రుణమాఫీ అంశాన్ని తన భుజాన వేసుకున్నారు. గతంలో వైఎస్సార్ హయాంలో 70 వేల కోట్ల రుణమాఫీ చేశారు. పంటల బీమా గతంలో లేకపోయినప్పటికీ ఇప్పుడు రాష్ట్రంలో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ప్రతీ రైతు పంటకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తుందని, రాష్ట్రంలో పండే అన్ని పంటలను ఎంఎస్పీ ప్రకారమే కొనుగోలు చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిన అన్ని పంటలను కేంద్రం కూడా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అయితే వ్యవసాయ రంగం, రైతుల విషయంలో కాంగ్రెస్ చేసిన వాగ్దానాలు అమలు చేసితీరుతామన్నారు.

# మదర్ డెయిరీకి శరాఘాతం

రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో లడ్డూలు, ఇతర ప్రసాదాల తయారీకి వినియోగించే నెయ్యిని ఇకపై విజయ డెయిరీ నుంచి కొనుగోలు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. జనవరి 1 నుండి విజయ నెయ్యిని అన్ని ఆలయాలు వినియోగించనున్నాయి.ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ మదర్ డైయిరీకి ఏటా కోట్ల రూపాయల్లో ఆదాయం కోల్పోనుంది. మదర్ డైయిరీకి ప్రధాన ఆదాయ వనరుగా యాదగిరిగుట్ట దేవస్థానానికి నెయ్యి విక్రయానికి బ్రేక్ పడుతోంది. మదర్ డైయిరీకి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంతో నాలుగు దశాబ్దాల అనుబంధం ఉంది. ఇప్పటికే నష్టాల ఊబిలో కూరుకుపోయిన మదర్ డైయిరీకి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం శరాఘాతంగా మారనుంది. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రం తెలంగాణ తిరుపతిగా విరాజిల్లుతోంది. ఆలయ పునర్నిర్మాణం తర్వాత స్వామివారి ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువైంది. స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు వస్తున్నారు. సాధారణ రోజుల్లో స్వామివారిని 30 వేల మంది భక్తులు దర్శించు కుంటున్నారు. శని ఆదివారాల్లో 50వేల మంది భక్తుల స్వామి వారిని దర్శించు కుంటున్నారు. తిరుపతి లడ్డు తర్వాత రుచి శుచిలో యాదగిరిగుట్ట స్వామి లడ్డును భక్తులు అమితంగా ఇష్టపడతారు. స్వామివారిని దర్శించుకున్న ప్రతి భక్తుడు మహా ప్రసాదంగా భావించే యాదాద్రి లడ్డును కొనుగోలు చేస్తున్నారు. యాదగిరిగుట్ట ఆలయంలో ప్రతిరోజు 22వేల లడ్డూలను తయారు చేస్తున్నారు. ఈ లడ్డు తయారీకి ప్రభుత్వ రంగ సంస్థ మదర్ డైయిరీ నెయ్యిని వినియోగిస్తున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ లో తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వివాదం తీవ్ర దుమారం రేపింది. ఈ నేపథ్యంలో తెలంగాణ సర్కార్ అప్రమత్తమై రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో విజయ డైయిరీ నెయ్యిని కొనుగోలు చేయాలని ఆదేశించింది. దీంతో యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి జనవరి 1నుంచి విజయ డెయిరీ నెయ్యి సరఫరా కానుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో మదర్ డైయిరీ ఏటా కోట్ల రూపాయల్లో ఆదాయం కోల్పోనుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని యాదగిరిగుట్ట, చెర్వుగట్టుతో పాటు రాష్ట్రంలోని కీసర, వేములకొండ తదితర ఆలయాలకు కొన్నేళ్లుగా మదర్ డెయిరీ నెయ్యి సరఫరా చేస్తోంది. తద్వారా మదర్ డెయిరీకి ఏటా రూ.36 కోట్ల వరకు ఆదాయం సమకూరుతోంది. ఇందులో ఒక్క యాదగిరిగుట్ట దేవస్థానం నెలకు 30 టన్నుల నెయ్యిని మదర్ డెయిరీ నుంచి కొనుగోలు చేస్తున్నారు. 35 ఏళ్లుగా మదర్ డైరీ నెయ్యిని వినియోగిస్తున్నామని, ఇందుకు గాను దేవస్థానం ఏటా రూ.18 కోట్ల వరకు చెల్లిస్తున్నామని ఆలయ అధికారులు చెబుతున్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDER, Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Tirumala Nagar Colony, Police Lane, Amberpet, Hyderabad - 500 013 Telangana.
Editor: CHERUKU UPENDAR, Publication at HAMSA PUBLICATIONS, H.No: 7-83/2, Hanuman Nagar Colony, Kuntloor, Abdullapurmet Mandal, Hayath Nagar, Pin:501505,
Rangareddy District/Hyderabad City, Telangana. E-mail:upendrabbk@gmail.com RNI: TELTEL12215